www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA



మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 19 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 120 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | SATURDAY AUGUST 19 2026 | VOL:1 | ISSUE: 120 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary




# కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

- పీఎంఏవై-జీ కింద మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు కేంద్ర మంత్రికి సీఎం కృతజ్ఞతలు
- ఎల్నినో ప్రభావంతో వ్యవసాయంలో పెరిగిన విద్యుత్ వినియోగం
- తాగునీరు, విద్యుత్ కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు
- వ్యవసాయ రంగానికి కేంద్ర సహకారం అందించాలని కోరిన సీఎం




హైదరాబాద్ మదాపూర్ లో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. పిఎంఏవై జీ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన సందర్భంగా కేంద్ర మంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతి పత్రం అందించిన సిఎం. రాష్ట్ర డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి వివరించిన సీఎం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపిన సీఎం. ఎల్నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని సీఎం వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరిన సీఎం.

(మిగతా 2వ పేజీలో..)

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ముందస్తు చర్యలు : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**రైతు నుంచి తాగునీటి వరకు సమగ్ర కార్యాచరణ..**

**19,543 మెగావాట్ల రికార్డు విద్యుత్ డిమాండ్‌ను తీర్చాం**

**నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం**

**రాబోయే 11--12 నెలలకు తాగునీటికి తొలి ప్రాధాన్యం**

పసిఫిక్ మహాసముద్రంలో సముద్రజలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తుందని, తెలంగాణలోనూ వర్షపాతం లోటు, జలాశయాల్లోకి తగ్గిన నీటి ప్రవాహం, వ్యవసాయంపై ఒత్తిడి, విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి పరిణామాలు కనిపించాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అయితే సమస్య తీవ్రతను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం ఏప్రిల్ నుంచే వివిధ శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టిందని ఆయన అసెంబ్లీలో వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా, ఆలస్యంగా, అసమానంగా కురిసే అవకాశం ఉంటుందని, భారత నైరుతి రుతుపవనాలపైనా దీని ప్రభావం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

(మిగతా 2వ పేజీలో..)



## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'.. ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

- టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం
- మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు
- ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు
- రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం
- కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం



పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు,

(మిగతా 2వ పేజీలో..)

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం.. సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి



పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ

(మిగతా 2వ పేజీలో..)

## కేసీఆర్ ఫామ్ హౌస్ రెవిన్యూ అధికారుల విచారణ... ఉద్రిక్తత

- ఎర్రవెల్లిలో అధికారులను అడ్డుకున్న దళిత రైతులు.. వాగ్వాదం
- మాకు సమాచారం ఇవ్వకుండా భూములు ఎలా కొలుస్తారు? అంటూ నిలదీత
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సర్వే చేస్తున్నాం : రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్ భూములపై గురువారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టడంతో రైతులు వారిని అడ్డుకున్నారు. దాంతో అక్కడ వాగ్వాదం జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి

(మిగతా 2వ పేజీలో..)



## సీఎం విజయ్ కీలక నిర్ణయం.. పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం!

- తమిళనాడులో సీఎం విజయ్ ప్రభుత్వం కొత్త పథకం
- ఎన్నికల హామీ మేరకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు గ్రాము బంగారు ఉంగరం

(మిగతా 2వ పేజీలో..)



హంస కలం వార్త

# కేసీఆర్ ఫామ్ హౌస్ రెవిన్యూ అధికారుల విచారణ... ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన భూముల వ్యవహారంపై బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించింది. 325 సర్వే నంబర్‌లో సుమారు 388 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉందన్న అంశాన్ని అసెంబ్లీలో సీఎం ప్రస్తావించారు. ఈ భూముల వాస్తవ పరిస్థితి, హద్దులు, రికార్డులు, ఎవరి ఆధీనంలో ఉన్నాయన్న అంశాలను పరిశీలించేందుకు విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మర్కుక్ తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఎర్రవల్లి చేరుకుని 325 సర్వే నంబర్ భూములను పరిశీలించారు. సర్వే ప్రక్రియను ప్రారంభించే సమయంలో గ్రామానికి చెందిన పలువురు దళిత రైతులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ భూముల్లో సర్వే నిర్వహించడంపై వారు అధికారులను ప్రశ్నించారు. దాంతో కొద్దిసేపు రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

సమాచారం లేకుండా ఎలా సర్వే చేస్తారు? : దళిత రైతులు

'తరతరాలుగా మేమే ఈ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా అధికారులు వచ్చి భూములను ఎలా కొలుస్తారు?' అంటూ రైతులు అధికారులను నిలదీశారు. తమ భూములకు సంబంధించిన రికార్డులు, హక్కుల అంశాలను పరిశీలించాల్సి ఉంటే తమకు ముందుగా సమాచారం ఇవ్వాలని కోరారు. అధికారులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామని, భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడం కోసమే సర్వే చేస్తున్నామని రైతులకు వివరించినట్టు తెలిసింది. సర్వే ద్వారా వెంటనే ఎవరి భూమిని స్వాధీనం చేసుకునే నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు.

'మా భూమికి ఫామ్‌హౌస్‌కు సంబంధం లేదు'

తమ భూములకు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి ఎలాంటి సంబంధం లేదని రైతులు స్పష్టం చేశారు. గ్రామంలోని కొంతమంది రైతులు తమ పట్టా భూములను స్వచ్ఛందంగా విక్రయించగా, వాటిని మార్కెట్ ధరకు కొనుగోలు చేసినట్టు తెలిపారు. దళిత కుటుంబాలతో పాటు గ్రామంలోని పేదలకు గతంలో వివిధ రకాలుగా సహాయం అందిందని చెప్పారు. తమ భూములను మొత్తం రీసర్వే చేసి, వాస్తవంగా సాగులో ఉన్న రైతుల వివరాలను నమోదు చేసి, అర్హత ఉన్న వారికి హక్కులు కల్పించే ప్రక్రియ చేపట్టాలని గతంలో ప్రయత్నాలు జరిగాయని, ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదని తెలిపారు. ఈ అంశంపై అధికారిక రికార్డులు, పాత సర్వే వివరాలు, భూ హక్కుల పత్రాలను పరిశీలించాల్సి ఉంది.

రికార్డుల ఆధారంగానే తేలనున్న హక్కులు

ప్రస్తుతం 325 సర్వే నంబర్ భూములపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించడంతో భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సాగుదారుల వివరాలు, అసైన్డ్ భూముల రికార్డులు తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సర్వే అనంతరం క్షేత్రస్థాయి వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు. సర్వే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, రైతులతో మాట్లాడి పరిస్థితిని అదుపులో ఉంచారు. అయితే 325 సర్వే నంబర్ భూములపై కొనసాగుతున్న విచారణ, రైతుల అభ్యంతరాలు, ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో ఎర్రవల్లిలో భూముల వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

388 ఎకరాలపై అసెంబ్లీలో ప్రస్తావన

325 సర్వే నంబర్‌లో సుమారు 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ పరిధిలో మొత్తం భూముల వివరాలు, వాటిలో ప్రభుత్వ భూమి ఎంత, ప్రయివేటు భూమి ఎంత, ఎవరి ఆధీనంలో ఉందన్న అంశాలను నిర్ధారించేందుకు విచారణ చేపట్టాలని సీఎం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూమి ఉన్నట్టు విచారణలో తేలితే అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళిత కుటుంబాలకు కేటాయిస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. అయితే ఈ భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, హక్కులు తదితర అంశాలపై తుది స్పష్టత అధికారిక సర్వే, రెవెన్యూ రికార్డుల పరిశీలన అనంతరం రావాల్సి ఉంది.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ముందస్తు చర్యలు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

2026 నైరుతి రుతుపవనాలు జూన్ 8న తెలంగాణలోకి ప్రవేశించినప్పటికీ, జూన్ 23 నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయని తెలిపారు.

ఆగస్టులో 38 శాతం వర్షపాతం లోటు

2026లో జూన్‌లో 12 శాతం, జూలైలో ఒక శాతం, ఆగస్టులో ఏకంగా 38 శాతం వర్షపాతం లోటు నమోదైందని భట్టి విక్రమార్క తెలిపారు. సాధారణంగా సెప్టెంబర్ 18 నాటికి 640 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఈ ఏడాది 543 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైందని వివరించారు. సగటు వర్షపాతం గణాంకాలు సమస్య తీవ్రతను పూర్తిగా ప్రతిబింబించవని ఆయన అన్నారు. పంటలకు అవసరమైన సమయంలో, తగిన విరామాలతో వర్షాలు కురవడం కీలకమని, ఒకటి రెండు రోజులు భారీ వర్షాలు కురిసినంత మాత్రాన అంతకుముందు ఏర్పడిన దీర్ఘకాలిక పొడి పరిస్థితుల ప్రభావం పూర్తిగా తొలగిపోదని చెప్పారు.

ఏప్రిల్ నుంచే ముందస్తు ప్రణాళిక

సమస్య ఏర్పడిన తర్వాత ప్రభుత్వం స్పందించలేదని, ఏప్రిల్ నుంచే ముందస్తు ప్రణాళిక ప్రారంభించామని తెలిపారు. భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖలతో సమీక్షలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని 1,600 గ్రామాల్లో నిర్వహించి రెండు లక్షలకు పైగా రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంటల వైవిధ్యీకరణ, తక్కువ నీటితో సాగు చేసే విధానాలపై అవగాహన కల్పించామని వివరించారు. 32 జిల్లాలకు ప్రత్యేక ఎల్‌నినో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామని, ఎల్‌నినో, పంటల నిర్వహణ, పంటల వైవిధ్యీకరణపై రూపొందించిన ఆరు వీడియోల ద్వారా సుమారు 31.92 లక్షల మంది రైతులు, ప్రజలకు సమాచారం అందించామని తెలిపారు. ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఇక్రిసాట్, ఐసీఎఆర్ - క్రిడా, ఐసీఎఆర్ - ఐఐఎంఆర్, ఐఎండి నిపుణులతో 27 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులను, రైతులను అప్రమత్తం చేశామని చెప్పారు.

దేశవ్యాప్తంగా విద్యుత్‌పై ఒత్తిడి

విద్యుత్ డిమాండ్ పెరుగుదల తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదని భట్టి తెలిపారు. 2026 ఆగస్టులో దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం 169.01 బిలియన్ యూనిట్లకు చేరిందని, గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఇది 12.85 శాతం అధికమని చెప్పారు. డే-అహెడ్ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు అభ్యర్థనలు 61.7 శాతం పెరిగాయని, సగటు విద్యుత్ ధర కూడా 22 శాతం పెరిగిందని తెలిపారు. గత ఏడాది ఆగస్టులో దేశ గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,29,720 మెగావాట్లు కాగా, ఈ ఏడాది ఆగస్టులో 2,58,270 మెగావాట్లకు చేరిందని చెప్పారు. ఇలాంటి జాతీయ స్థాయి ఒత్తిడి మధ్య తెలంగాణ తన రికార్డు విద్యుత్ డిమాండ్‌ను తీర్చగలిగిందని తెలిపారు. విద్యుత్ రంగంలో ముందస్తు చర్యలు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని పునరుద్ధరించినప్పటికీ నీటి లభ్యత తగ్గడంతో హైడల్ ఉత్పత్తి పరిమితమైందని చెప్పారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల పూర్తి స్థాయి లభ్యత కోసం నిరంతర పర్యవేక్షణ చేపట్టామని, సింగరేణి బొగ్గు ఉత్పత్తిని పెంచుతూ ఉత్పత్తిలో 90 శాతాన్ని రాష్ట్ర విద్యుత్ అవసరాలకు కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో వాతావరణ ఆధారిత విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, దీర్ఘకాలిక పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలు, ప్రత్యేక పీక్ పవర్ సామర్థ్యం, మరింత ఖచ్చితమైన విద్యుత్ డిమాండ్ అంచనా వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం

వర్షాభావ పరిస్థితుల్లో గ్రామీణ జీవనోపాధులను కాపాడేందుకు ఉపాధి హామీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది ఉపాధి పనులకు హాజరయ్యారని, జూలై నుంచి వ్యవసాయేతర పనికాలంలోనూ రోజుకు సుమారు రెండు లక్షల మంది ఉపాధి కోరుతున్నారని చెప్పారు. 2026--27లో ఇప్పటివరకు 7.3 కోట్ల పని దినాలను సృష్టించి, 21 లక్షల కుటుంబాలకు చెందిన 31.5 లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. వేతనాల రూపంలో రూ.2,100.53 కోట్లను నేరుగా కూలీలకు చెల్లించామని వెల్లడించారు. నీటి సంరక్షణ, పశుగ్రాస అభివృద్ధి, ఉద్యానవనాలు, కిచెన్ గార్డెన్లు, నేలలో తేమను నిలిపే పనులకు ఉపాధి కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

శాఖల సమన్వయంతోనే సవాల్‌కు పరిష్కారం

ఎల్‌నినో ప్రభావాన్ని ఒక్క శాఖ మాత్రమే ఎదుర్కోలేదని, వ్యవసాయం, సాగునీరు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, పశు సంవర్ధక, ఆరోగ్యం, విద్యుత్, విపత్తు నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. "నష్టం జరిగిన తర్వాత పరిహారం చెల్లించడం మాత్రమే ప్రభుత్వ విధానం కాదు. నష్టం జరగకముందే ప్రమాదాన్ని గుర్తించడం, రైతుకు ముందుగానే సమాచారం ఇవ్వడం, ప్రత్యామ్నాయ పంటను సూచించడం, నీటిని సంరక్షించడం, ఉపాధి కల్పించడం, తాగునీటిని రక్షించడం, సాధ్యమైనంత మేరకు విద్యుత్‌ను సమీకరించడం మా విధానం" అని తెలిపారు. ఎల్‌నినోను ప్రస్తావించడం సాకు కాదని, ఈ ఏడాది వర్షపాతం, వ్యవసాయం, నీరు, విద్యుత్‌పై ఏర్పడిన అసాధారణ ఒత్తిడికి శాస్త్రీయమైన వివరణ అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రకృతి మన నియంత్రణలో లేకపోయినా ప్రజలను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. అసాధారణ వర్షపాతం లోటు, దేశవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ డిమాండ్, మార్కెట్‌లో పోటీ ఉన్నప్పటికీ తెలంగాణలో 19,543 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను తీర్చగలిగామని తెలిపారు. "ఆ 19,543 మెగావాట్లు కేవలం ఒక రికార్డు సంఖ్య కాదు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతుకు, గృహానికి, పరిశ్రమకు, ప్రజలకు విద్యుత్ సరఫరా కొనసాగించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపిన సీఎం. సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామన్న సీఎం. ఎల్నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులకు ప్రోత్సహిస్తున్నామని వివరించిన ముఖ్యమంత్రి. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటెబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపిన సీఎం. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం.. సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు.22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది.ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'.. ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## సీఎం విజయ్ కీలక నిర్ణయం.. పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం!

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 6న జరగనున్న అసెంబ్లీ ఉపఎన్నికల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.'తైమామన్ తంగ మోతిరం' (మేనమామ బంగారు ఉంగరం)' పేరిట రూపొందించిన ఈ పథకాన్ని సెప్టెంబర్ 28న అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఏడాది జూన్ 22వ తేదీ నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులందరికీ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 22 నుంచి ఉంగరాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ. 755 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.తమిళనాడు శాశ్వత నివాసితులై ఉండి, గ్రా×జవీజు పోర్టల్‌లో =జిఎ ఐడీతో నమోదైన తల్లులకు జన్మించిన శిశువులు ఈ పథకానికి అర్హులు. తొలి దశ అమలు కోసం ఇప్పటికే 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రతి ఉంగరానికి ఒక ప్రత్యేక సీరియల్ నంబర్‌ను కేటాయించారు. ప్రాథమికంగా 107 పంపిణీ కేంద్రాల ద్వారా ఈ ఉంగరాలను అందజేస్తారు. భవిష్యత్తులో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలోనే శిశువులకు వీటిని అందించేలా పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నారు.మధురాంతకం, ధరాపురం నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పథకం ప్రకటన వెలువడింది. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున, ఈ రెండు నియోజకవర్గాల్లో పథకాన్ని ప్రారంభించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి నిరాకరించింది. తమిళ సంప్రదాయాలను గౌరవించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

సెప్టెంబర్ । శనివారం । 19 । 2026

హంస కలం వార్త



# కేటీఆర్‌కు మద్దతుగా నాంపల్లి కోర్టుకు ముద్దం నర్సింహ యాదవ్





**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (హంస కలంవార్త):**

ఫార్ములా–ఈ కేసు విచారణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయనకు మద్దతుగా ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కోర్టు వద్దకు చేరుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. కేటీఆర్‌పై నమోదైన ఫార్ములా–ఈ కేసు రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ఆరోపించారు. న్యాయస్థానంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేటీఆర్ చేసిన కృషికి బీఆర్ఎస్ శ్రేణులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆయనకు మద్దతుగా నిలుస్తామని ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేటర్లు సతీష్ గౌడ్, రవీందర్ రెడ్డి, డివిజన్ సెక్రటరీ హరినాథ్, గడ్డం నర్సింగ్ రావు, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫార్ములా–ఈ కేసు తదుపరి విచారణను నాంపల్లి ఏసీబీ కోర్టు అక్టోబర్ 30కి వాయిదా వేసింది.



# ఒకే కెమెరాతో పలు ట్రాఫిక్ ఉల్లంఘనలకు చెక్



**ఔటర్ రింగ్‌రోడ్డుపై అధునాతన నిఘా వ్యవస్థలపై సైబరాబాద్ సీపీ సమీక్ష**

**హైదరాబాద్, ( సెప్టెంబర్-18 హంస కలంవార్త ) సెప్టెంబరు 18:**

ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ ఉల్లంఘనలను మరింత సమర్థవంతంగా గుర్తించి నియంత్రించేందుకు సైబరాబాద్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఒకే కెమెరాతో పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించే అధునాతన వ్యవస్థ పనితీరును సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ శుక్రవారం సమీక్షించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నియంత్రణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ.. ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానం, ఉల్లంఘనలను





స్వయంచాలకంగా గుర్తించే సాంకేతిక వ్యవస్థలు, రోడ్డు భద్రతకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఒకే కెమెరాతో పలు ఉల్లంఘనల గుర్తింపుఒకే కెమెరా ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తూ పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించేలా రూపొందించిన నూతన వ్యవస్థ పనితీరును అధికారులు సీపీకి వివరించారు. కెమెరాల ద్వారా సేకరించిన దృశ్యాలను విశ్లేషించి, ఉల్లంఘనలను స్వయంచాలకంగా గుర్తించే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు.

రోడ్డు భద్రతకు సాంకేతికత దన్ను

ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ క్రమశిక్షణను పెంచడం, ప్రమాదాలను నివారించడం, వాహనాల రాకపోకలను సక్రమంగా నిర్వహించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించడంపై సీపీ అధికారులతో చర్చించారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిరంతర నిఘా, ఉల్లంఘనల గుర్తింపు, సమర్థవంతమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు. టర్ రింగ్‌రోడ్డుపై మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ, ప్రయాణికుల భద్రత కోసం సైబరాబాద్ పోలీసులు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌బీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. సతీందర్ సింగ్ రాణా, ప్రాజెక్టు అధిపతి కల్నల్ గిరీశ్వర్, ప్రాజెక్టు సమన్వయకర్త బిస్వజిత్ సింగ్, సీనియర్ జనరల్ మేనేజర్ చాంద్ బాషా, టోల్ జనరల్ మేనేజర్ మూర్తి, ఎస్‌సీఎస్–సీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నవీద్, ట్రయోస్ సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం

**కూకట్‌పల్లి, ( సెప్టెంబర్-18 హంస కలంవార్త )**



సెప్టెంబర్ 18: ఫతేనగర్ డివిజన్‌కు చెందిన గీతాదేవి (భర్త ప్రమోద్‌కుమార్)కు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 1,00,000 ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్‌ఓసీ చెక్కును కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని లబ్ధిదారు గీతాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డైవర్షన్లు, డ్రామాలతో 22-ఏ వ్యవహారం నుంచి తప్పించుకోలేరు

**అసెంబ్లీలో మమ్మల్ని సస్పెండ్ చేసి బ్యాట్స్‌మెన్ లేకుండా బౌలింగ్ ఎందుకు? -- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (హంస కలంవార్త):**



22-A అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎన్ని డైవర్షన్లు చేసినా, ఎన్ని డ్రామాలు ఆడినా 22-A వ్యవహారంలో జరిగిన పరిణామాల నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ప్రజల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో మరో అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. మహా అయితే ఒకటి రెండు రోజులు అనుకూల మీడియాలో ప్రచారం చేసుకోవచ్చని, అయితే ప్రజల్లో ఉన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు.

"అసెంబ్లీలోనే సమాధానం చెప్పాలి"

22-A అంశంపై శాసనసభలో జరిగిన చర్చను ప్రస్తావిస్తూ.. సభ సాక్షిగా ముఖ్యమంత్రి చెప్పిన విషయాలపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. తమను సభ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదని అన్నారు. "చేతనైతే అసెంబ్లీలో మా సస్పెన్షన్ ఎత్తేయండి.. మేము సభకు వస్తాం. మమ్మల్ని బయటకు పంపి బ్యాట్స్‌మెన్ లేకుండా బౌలింగ్ ఎందుకు చేస్తారు?" అంటూ ఆయన విమర్శించారు.

"మమ్మల్ని పిలిస్తే బ్యాట్‌తో సిక్సులు కొడతాం"

ప్రభుత్వం తమను తిరిగి శాసనసభకు అనుమతించాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. తమకు మాట్లాడే అవకాశం ఇస్తే 22-A అంశంతో పాటు ప్రజలకు సంబంధించిన ఇతర సమస్యలను కూడా సభలో ప్రస్తావిస్తామని తెలిపారు. "మమ్మల్ని అసెంబ్లీకి పిలవండి.. బ్యాట్‌తో సిక్సులు కొడతాం" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. 22-A అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని జగదీష్ రెడ్డి కోరారు. ప్రజా సమస్యలపై శాసనసభలో సమగ్ర చర్చకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వినాయకుడి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

**చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి వేడుకలు**

**గాజులరామారం:( సెప్టెంబర్-18 హంస కలంవార్త )**



వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా 125 గాజులరామారం ప్రాంతంలో చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రథమ పూజ్యుడైన లంబోదరుడి కృపాకటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య వెల్ఫేర్ సొసైటీ సభ్యులు లక్ష్మణ్, శివకుమార్ (లడ్డూ), అఖిల్ సాయినాథ్, రాజశేఖర్, చైతన్య, మహేష్ కుమార్, నిఖిల్, బాబి, మురళీకృష్ణ, బంటి, చింటూ, మల్లికార్జున్, విజయ్ కుమార్, నరేష్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తప్పులకు తావులేకుండా చర్యలు

**హియరింగ్, ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**





**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (హంస కలం వార్త):**




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులపై విచారణ, ధ్రువపత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పటిష్టంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్ మండల కమిషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పుష్పగుచ్ఛంతో ఆయనకు స్వాగతం పలికారు. ఓటర్ల వివరాలను నిర్ధారించే విధానం, ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయిలో అందిస్తున్న సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియలను సుదర్శన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ జరగని ఓటర్ల వివరాలు, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఉన్న వ్యత్యాసాలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల పరిశీలనను జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరైనప్పుడు వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను పూర్తిగా ధ్రువీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. విచారణ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న రిజిస్టర్లను, కంప్యూటర్లలో ధ్రువపత్రాల నమోదు ప్రక్రియను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్, ఉప కమిషనర్లు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి దొడ్ల వెంకటేష్ గౌడ్







**కూకట్‌పల్లి: ( సెప్టెంబర్-18 హంస కలంవార్త )**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేజ్-1, పీజేఆర్ నగర్ ఫేజ్-2, ఎన్టీఆర్ నగర్, తులసి నగర్-3, ఇందిరా హిల్స్, తులసి నగర్-1, ఈస్ట్ సాయినగర్,



మహంకాళి నగర్ కాలనీలలో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ, శంషిగూడ డివిజన్‌ల ప్రజలంతా ఐకమత్యంతో



వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గురువుకు శిష్యుడి విజయమే అతిపెద్ద గౌరవం



**బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (హంస కలం వార్త):**

ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.



వివేకానంద్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్‌లోని పద్మావతి కన్వెన్షన్‌లో నిర్వహించిన 'గురు సన్మాన్ పురస్కార్--2026' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 75 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితాన్ని



నిర్మించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. శిష్యుడి విజయం గురువుకు దక్కే అతిపెద్ద గౌరవమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న వారు విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కె. రామేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు గౌడ్, జిల్లా కోశాధికారి గిరిబాబు, అనిల్, కోల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు కైతి శ్రీనివాసరెడ్డి, గడ్డమీది బాలరాజ్, భూపతి రెడ్డి, సీహెచ్. నరసింహులు గౌడ్, ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంకు ఘన స్వాగతం



మెదక్ జిల్లా: ( సెప్టెంబర్-18 హంస కలంవార్త )

మెదక్ జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశానికి విచ్చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మీడియా సమావేశంలో జిల్లాకు సంబంధించిన పలు అంశాలు, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# అనాథ విద్యార్థులకు అండగా ఫ్రెండ్స్ గ్రూప్




నిత్యావసర సరుకులు అందజేసిన జిల్లా గణేష్ నేత

అల్విన్ కాలనీ: ( సెప్టెంబర్-18 హంస కలంవార్త )

124వ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ది సుధీర్ ఫౌండేషన్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల భోజన అవసరాల కోసం నిత్యావసర సరుకులను జిల్లా గణేష్ నేత అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లోని విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ది సుధీర్ ఫౌండేషన్ ఫౌండర్ రాజీవ్ ఆధ్వర్యంలో సుమారు 120 మంది విద్యార్థులకు విద్యతో పాటు హాస్టల్ వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు గణేష్ నేత తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరి మహిళల పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఫౌండేషన్ అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులకు విద్య, వసతి, భోజనం అందించేందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటంతో ఫౌండేషన్ నిర్వాహకులపై ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకున్న ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు తమ వంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందజేసినట్లు గణేష్ నేత పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఫౌండేషన్‌కు తమవంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థుల విద్యాభ్యాసం, భోజనం, వసతి కోసం సహాయం చేయదలచిన వారు ఫౌండేషన్ ఫౌండర్ రాజీవ్‌ను 9959123029 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు సూరిబాబు, ఆనంద్, రమేష్, సంగారెడ్డి, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.







# మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో 'సేతు' ఏఐ స్మార్ట్ కియోస్క్ ప్రారంభం



హైదరాబాద్: ( సెప్టెంబర్-18 హంస కలంవార్త )

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల్లోని సంకోచాన్ని తొలగించి, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియలో పారదర్శకతతో పాటు వేగాన్ని పెంచే లక్ష్యంతో హైదరాబాద్ నగర పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో 'సేతు' పేరుతో అత్యాధునిక ఏఐ ఆధారిత స్మార్ట్ కియోస్క్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఈ స్మార్ట్ కియోస్క్ ద్వారా బాధితులు తమ సమస్యలను సొంత భాషలో స్వేచ్ఛగా వివరించవచ్చు. ఫిర్యాదులను తక్షణమే డిజిటల్ విధానంలో నమోదు చేయడంతో పాటు, వాటి విచారణ పురోగతిని నిజ సమయంలో పర్యవేక్షించే సదుపాయం ఇందులో ఉంది. పోలీసులకు, ప్రజలకు మధ్య విశ్వాసానికి వారధిగా 'సేతు' పనిచేస్తుందని అధికారులు తెలిపారు. స్టేషన్ రిసెప్షన్ వద్దే సందర్శకులకు తక్షణ సహాయం, గౌరవప్రదమైన సేవలు అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఫిర్యాదుల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ప్రజలకు తమ సమస్యలపై స్పష్టమైన సమాచారం అందేలా ఈ కియోస్క్ ఉపయోగపడుతుందని వివరించారు. త్వరలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో 'సేతు' సేవలను దశలవారీగా అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. పౌరులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను పోలీసులకు తెలియజేయాలని హైదరాబాద్ నగర పోలీసులు కోరారు.



# గణపతి మండపాలను సందర్శించిన కుమార్ యాదవ్

ఆల్విన్ కాలనీ:

( సెప్టెంబర్-18 హంస కలంవార్త )



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను బీజేపీ యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ సందర్శించారు. ఆయా ఉత్సవ సమితుల సభ్యుల ఆహ్వానం మేరకు మండపాలకు చేరుకున్న ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు కుమార్ యాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణపతి విగ్రహాలను దర్శించుకున్న ఆయన, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని గణపతిని ప్రార్థించినట్లు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని కుమార్ యాదవ్ పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసిల్దార్

ములుగు జిల్లా, సెప్టెంబర్ 18:( సెప్టెంబర్-18 హంస కలంవార్త )




భూమి పౌతి మార్పిడి చేసి వారసురాలి పేరుపై పట్టా చేసేందుకు రూ.14 వేల లంచం డిమాండ్ చేసి, ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా గోవిందరావుపేట తహసిల్దార్ సృజన్ కుమార్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గోవిందరావుపేట మండల పరిధిలోని ఓ భూమికి సంబంధించి యజమాని మృతి చెందడంతో, ఆయన కుమార్తె పేరుపై ఎకరం 5 గుంటల భూమిని పౌతి మార్పిడి చేసి పట్టా ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ కోసం తహసిల్దార్ రూ.14 వేలు లంచంగా డిమాండ్ చేసినట్లు బాధితులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి శుక్రవారం గోవిందరావుపేట తహసిల్దార్ కార్యాలయంలో వల పన్నారు. బాధితుల నుంచి రూ.14 వేల లంచం తీసుకుంటున్న సమయంలో తహసిల్దార్ సృజన్ కుమార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచంగా తీసుకున్న నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. మృతుడి కుమార్తె పేరుపై భూమి మార్పిడి ప్రక్రియ చేపట్టేందుకు రూ.14 వేలు ఇవ్వాలని తహసిల్దార్ డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా ప్రణాళిక ప్రకారం దాడి నిర్వహించి తహసిల్దార్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్ సృజన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, కేసుకు సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టారు. నిందితుడిని శనివారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

## కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (హంస కలం వార్త):



కూకట్‌పల్లిలోని మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. రైతు బజార్‌లో లభిస్తున్న ధరల ప్రకారం కూరగాయల ధరల్లో కొంత వ్యత్యాసం కనిపించింది. టమాటా కిలో రూ.17, వంకాయ రూ.28, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.43, బజ్జీ మిర్చి రూ.23, కాకరకాయ రూ.29, బీరకాయ రూ.33, క్యాబేజీ రూ.15, చిక్కుడు రూ.55, క్యారెట్ రూ.47, కాలీఫ్లవర్ రూ.25, దొండకాయ రూ.35, అలసందలు రూ.40, గోరుచిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.32, క్యాప్సికం రూ.40, బంగాళాదుంప రూ.18, స్థానిక కీర రూ.23, ఇటాలియన్ కీర రూ.45, దోసకాయ రూ.28, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, చేమ రూ.28, పచ్చి ఉల్లిపాయ రూ.35, ఎండు ఉల్లిపాయ రూ.40, పచ్చి చింతకాయ రూ.35, పచ్చి మామిడి ఒక్కటి రూ.15 నుంచి రూ.20 వరకు ఉన్నాయి. ఇక అరటి పచ్చికాయ ఒక్కటి రూ.9 నుంచి రూ.10, చేమదుంప రూ.28, ముల్లంగి ఒక్కటి రూ.6 నుంచి రూ.8, చిలకడదుంప రూ.40, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు డజను రూ.60 నుంచి రూ.80, మునగకాయ ఒక్కటి రూ.6 నుంచి రూ.8, పచ్చిబఠాణీ రూ.80, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.45, ఎండు మిర్చి రూ.260, పాత అల్లం రూ.220, కొత్త అల్లం రూ.120, వెల్లుల్లి రూ.240, చింతపండు రూ.160, ఎర్ర మిర్చి రూ.80, ఉసిరికాయ రూ.100, కరివేపాకు రూ.50, పరవల్ రూ.55, వేరుశెనగ రూ.50, లోబియా రూ.23, ఆ కాకరకాయ రూ.120గా ధరలు నమోదయ్యాయి. రైతు బజార్‌లో తాజా కూరగాయలు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు ధరలను పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు. ధరలు రోజువారీగా మారే అవకాశం ఉన్నందున కొనుగోలు సమయంలో రైతు బజార్‌లోని ప్రస్తుత ధరలను తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



హంస కలం వార్త

## గణేష్ మండపాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ

**భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**



**సెప్టెంబర్ 18, హంస కలం వార్త:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గుండ్లపోచంపల్లి పరిధిలోని అపర్ణ తులిప్, మ్యారిగోల్డ్, ఎల్లోబెల్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి, ఐపీఎస్ శుక్రవారం సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని, నిర్వాహకులతో ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు, నిర్వాహకులు పరస్పరం సహకరించుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని అవగాహన కల్పించారు. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణిస్తూ, పోలీసుల సూచనలకు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గుర్తించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సీపీ సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఎస్‌హెచ్ఓ విజయవర్ధన్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంధం యేసు రాజుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (హంస కలంవార్త):**



కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం యేసు రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పాల్గొని గంధం యేసు రాజుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గంధం యేసు రాజును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కూడిన సంపూర్ణ జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవరావు, మేకల మైకల్, గంధం కరుణాకర్ నాయుడు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, దేవసహాయం రవి, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, మహిళా నాయకురాళ్లు వనజ, స్వాతి రెడ్డి, దీప్తి తదితరులు పాల్గొని గంధం యేసు రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# ఉమ్మడి మెదక్ చరిత్రకు సాక్ష్యంగా మెతుకుకోట



**కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఘన చరిత్రను మోస్తున్న చారిత్రక కట్టడం**

**మెదక్:( సెప్టెంబర్-18 హంస కలంవార్త )**

ఎడిటర్ తెలంగాణ చరిత్రలో ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రాచీన కాలం నుంచి అనేక రాజవంశాల పాలనకు సాక్ష్యంగా నిలిచిన ఈ ప్రాంతంలో మెదక్ కోట ఒక ముఖ్యమైన చారిత్రక కట్టడం. పూర్వం మెదక్‌ను లి"మెతుకుదుర్గం"లిగా పిలిచేవారు. కాలక్రమంలో "మెతుకు"గా, ఆ తర్వాత "మెదక్"గా పేరు మారిందని జిల్లా అధికారిక చరిత్రలో పేర్కొనబడింది. ఈ ప్రాంతంలో సన్న, ముతక బియ్యం సమృద్ధిగా పండటం కూడా "మెతుకు" అనే పేరుకు కారణంగా చెబుతారు.

### కాకతీయుల కాలంలో నిర్మాణం



మెదక్ పట్టణానికి సమీపంలోని ఎత్తైన కొండపై నిర్మితమైన ఈ కోటకు సుమారు 800 సంవత్సరాల చరిత్ర ఉంది. తెలంగాణ ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్ ప్రకారం, 12వ శతాబ్దంలో కాకతీయుల పాలనలో ప్రతాపరుద్రుడి కాలంలో ఈ కోట నిర్మించబడింది. అప్పట్లో దీనిని "మెతుకుదుర్గం" అని పిలిచేవారు. సహజసిద్ధమైన కొండ, రాతిబండలను రక్షణకు అనుకూలంగా ఉపయోగించుకుని కోట నిర్మాణాన్ని చేపట్టడం నాటి నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కాకతీయుల కాలంలో ఈ కోట కేవలం రాజభవనంగా కాకుండా రక్షణ, పరిపాలన, సైనిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఉపయోగపడింది. ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు అనుకూలంగా ఉండేది. అనంతరం కాలంలో ఈ కోటను వివిధ రాజవంశాలు తమ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేశాయి.

### అనేక రాజవంశాలకు సాక్ష్యం



కాకతీయుల తర్వాత మెదక్ ప్రాంతం బహమనీ రాజ్యం, గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలోకి వెళ్లింది. కుతుబ్‌షాహీల కాలంలో కోటలో పలు నిర్మాణాలు, సైనిక అవసరాలకు సంబంధించిన ఏర్పాట్లు జరిగాయి. కోట పరిసరాల్లో 17వ శతాబ్దానికి చెందిన మసీదు, ధాన్యాగారాల ఆనవాళ్లు కూడా ఉన్నాయి కుతుబ్‌షాహీల అనంతరం ఈ ప్రాంతం మొఘల్ పాలనలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆసఫ్‌జాహీల ఆధ్వర్యంలో హైదరాబాద్ నిజాం పాలనలో భాగమైంది. ఇలా శతాబ్దాల పాటు మారిన రాజకీయ పరిస్థితులకు మెదక్ కోట ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది



### మూడు ప్రధాన ద్వారాలు

మెదక్ కోట నిర్మాణంలో ప్రధాన ఆకర్షణ దాని ద్వారాలు. కోటకు ప్రథమ ద్వారం, సింహ ద్వారం, గజ ద్వారం అనే మూడు ప్రధాన ప్రవేశ మార్గాలు ఉన్నాయి. సింహ ద్వారం వద్ద సింహాల ఆకృతులు, గజ ద్వారం వద్ద ఏనుగుల శిల్పాలు కనిపిస్తాయి. ప్రధాన ద్వారం వద్ద గండభేరుండం అనే రెండు తలల పక్షి చిహ్నం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ నిర్మాణాలు నాటి శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తాయికోటలో పాత సైనిక శిబిరాలు, ధాన్యాగారాలు, నీటి వనరుల ఆనవాళ్లు కనిపిస్తాయి. 17వ శతాబ్దానికి చెందిన సుమారు 3.2 మీటర్ల పొడవైన ఫిరంగి కూడా ఇక్కడి చారిత్రక ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. దానిపై త్రిశూల ఆకృతి చెక్కబడి ఉన్నట్లు జిల్లా అధికారిక వివరాలు చెబుతున్నాయి

### చరిత్రలో మెతుకుసీమకు ప్రత్యేక స్థానం

మెదక్ ప్రాంతం కేవలం కోటకే కాకుండా ప్రాచీన నాగరికతలకు కూడా నిలయంగా ఉంది. సమీపంలోని కొండాపూర్‌లో జరిగిన పురావస్తు తవ్వకాలలో శాతవాహనుల కాలానికి చెందిన అనేక నాణేలు, ఇతర పురావస్తు అవశేషాలు బయటపడ్డాయి. దీంతో ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ప్రాచీన కాలం నుంచే ఉన్న చారిత్రక ప్రాధాన్యం స్పష్టమవుతోంది చరిత్రలో మెదక్ ప్రాంతం వివిధ రాజ్యాల మధ్య జరిగిన రాజకీయ పరిణామాలకు వేదికగా నిలిచింది. కాకతీయులు, బహమనీ పాలకులు, కుతుబ్‌షాహీలు, మొఘలులు, నిజాం పాలన వంటి విభిన్న దశలను ఈ ప్రాంతం చూసింది. అందుకే మెదక్ కోటను కేవలం ఒక పురాతన కోటగా కాకుండా తెలంగాణ రాజకీయ, సాంస్కృతిక, నిర్మాణ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా చూడవచ్చు.

### నేటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్న కోట

ప్రస్తుతం మెదక్ కోట తెలంగాణలోని ప్రముఖ చారిత్రక పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా ఉంది. కొండపై నుంచి కనిపించే మెదక్ పట్టణ పరిసర ప్రాంతాల దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. కోటలోని పాత గోడలు, ద్వారాలు, శిల్పాలు, ఫిరంగి, మసీదు, ధాన్యాగారాల ఆనవాళ్లు గత వైభవాన్ని గుర్తుచేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా మెదక్ కోటను ముఖ్యమైన చారిత్రక వారసత్వ కట్టడంగా గుర్తించింది. మెతుకుదుర్గంగా ఆవిర్భవించి, కాలక్రమంలో మెదక్‌గా ప్రసిద్ధి చెందిన ఈ చారిత్రక కోట శతాబ్దాల చరిత్రను తన గోడల్లో దాచుకుంది. కాకతీయుల నిర్మాణ ప్రతిభకు, కుతుబ్‌షాహీల కాలపు అభివృద్ధికి, దక్కన్ ప్రాంతంలోని రాజకీయ పరిణామాలకు సాక్ష్యంగా నిలుస్తూ నేటికీ తన ప్రత్యేకతను చాటుతోంది. చరిత్రను తెలుసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ మెదక్ కోట ఒక సజీవ చరిత్ర పాఠశాల వంటిది.--- ఆధారాలు: మెదక్ జిల్లా అధికారిక వెబ్‌సైట్, తెలంగాణ పర్యాటక శాఖ



హంస కలం వార్త



# రొనాల్డో అభిమానులకు శుభవార్త.. రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టే!

### అంతర్జాతీయ కెరీర్‌పై ఊహాగానాలకు తెరదించిన రొనాల్డో

### సెప్టెంబర్ 24 నుంచి పోర్చుగల్ నేషన్స్ లీగ్ ప్రయాణం ప్రారంభం



పోర్చుగీస్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించాడు. త్వరలో జరగబోయే యూఈఎఫ్ఏ (ఖజుఖీూ) నేషన్స్ లీగ్ మ్యాచ్‌ల కోసం పోర్చుగల్ కొత్త హెడ్ కోచ్ జార్జ్ జెస్సస్ ప్రకటించిన జట్టులో అతనికి చోటు లభించింది. దీంతో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి తప్పుకోవడం లేదని స్పష్టమైంది. ఇటీవల జరిగిన 2026 ఫిఫా ప్రపంచకప్‌లో, ప్రీక్వార్టర్ ఫైనల్ లో స్పెయిన్ చేతిలో పోర్చుగల్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఆ టోర్నమెంట్ తర్వాత రొనాల్డో తన అంతర్జాతీయ భవిష్యత్తుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అదే తన చివరి ప్రపంచకప్ అని సూచించినప్పటికీ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్మెంట్ మాత్రం ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో, అతని కెరీర్‌పై తీవ్రమైన చర్చ నడిచింది. తాజాగా కోచ్ జెస్సస్ ప్రకటించిన జట్టులో రొనాల్డో పేరు ఉండటంతో ఈ ఉత్కంఠకు తెరపడింది. ప్రపంచకప్ నిష్క్రమణ తర్వాత రాబర్టో మార్టినెజ్ స్థానంలో జార్జ్ జెస్సస్‌ను పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య కొత్త కోచ్‌గా నియమించింది. గతంలో సౌదీ అరేబియా క్లబ్ అల్-నసర్‌కు కోచ్‌గా పనిచేసిన జెస్సస్‌కు, రొనాల్డోతో మంచి పరిచయం ఉంది. వీరిద్దరి ఆధ్వర్యంలో గత సీజన్‌లో ఆ క్లబ్ లీగ్ టైటిల్ కూడా గెలుచుకుంది. అయితే, తన ఆధ్వర్యంలో రొనాల్డోకు ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యత ఉండదని జెస్సస్ స్పష్టం చేశాడు. "జట్టుకు ఎంపికైన ఆటగాళ్లందరూ నాకు సమానమే. రొనాల్డో బాగా ఆడితే జట్టులో ఉంటాడు, లేదంటే ఉండడు. నేను అందరినీ ఇదే విధంగా చూస్తాను" అని విలేకరులతో అన్నాడు. ప్రస్తుతం 41 ఏళ్ల రొనాల్డో, పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 146 గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అంతేకాకుండా, తన కెరీర్‌లో 1000 గోల్స్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ప్రస్తుతం క్లబ్, అంతర్జాతీయ మ్యాచుల్లో కలిపి 979 గోల్స్ సాధించాడు. అయితే, ఈ ఘనతను అతను పోర్చుగల్ జట్టు కన్నా అల్-నసర్ క్లబ్ తరఫునే అందుకునే అవకాశం ఉందని జెస్సస్ అభిప్రాయపడ్డారు. పోర్చుగల్ తమ నేషన్స్ లీగ్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 24న వేల్స్‌తో స్వదేశంలో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. ఆ తర్వాత మూడు రోజులకు నార్వేతో తలపడనుంది. అక్టోబర్ 1న డెన్మార్క్‌తో, అక్టోబర్ 4న మళ్లీ నార్వేతో ఆడనుంది.

# దేశవాళీ అంపైర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్.. వేతనాల పెంపునకు ఏకగ్రీవ ఆమోదం




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు సంబంధించి ఒక కీలకమైన, సానుకూల నిర్ణయం తీసుకుంది. వారి వేతనాల పెంపుతో పాటు, గ్రేడ్లను పునర్వర్గీకరించే ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నేడు ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ చర్య ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఐపీఎల్ పాలక మండలికి (జీసీ) ఇద్దరు సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తయింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా మరోసారి కొనసాగేందుకు పోటీ పడిన అరుణ్ సింగ్ ధూమల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రతినిధిగా ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు స్థానాలకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో, బీసీసీఐ ఎన్నికల అధికారి ఏ.కే. జోటి వారి ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించారు. దీనితో ఐపీఎల్ పరిపాలనలో స్థిరత్వం కొనసాగనుంది. సమావేశంలో పలు ఆర్థిక, పరిపాలనాపరమైన తీర్మానాలకు కూడా ఆమోదం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటెడ్ ఖాతాలను, 2026-27 వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీ ఆమోదించింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను కూడా నియమించింది. భవిష్యత్ ప్రణాళికలపై కూడా బోర్డు దృష్టి సారించింది. 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించాలని, అలాగే 2028లో బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని తీర్మానించింది. శతాబ్ది వేడుకలు 2027 డిసెంబర్‌లో ప్రారంభమై 2028 అంతటా కొనసాగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. వీటితో పాటు, లైంగిక వేధింపుల నిరోధక (పోష్) పాలసీ కింద కొత్త అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. వయో నిర్ధారణ విధానానికి కూడా నూతనంగా ఆమోదం తెలిపారు. దేశంలోని దివ్యాంగ క్రికెటర్లకు మద్దతును మరింత క్రమబద్ధీకరించడం, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై కూడా రాష్ట్ర సంఘాలతో చర్చించారు. ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, సౌరభ్ తివారీ, జయదేవ్ షా, రోహన్ జైట్లీ, అభిషేక్ దాల్మియా వంటి కీలక వ్యక్తులు పాల్గొన్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు.

# ఆసియా క్రీడలు: జపాన్‌లో భారత అథ్లెట్లకు వసతి సమస్య.. రంగంలోకి ఎన్నారైలు

### ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల వసతి సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు

### జపాన్‌లోని నగోయాలో మూడంచెల సహాయక వ్యవస్థ ఏర్పాటు

### ఎయిర్‌పోర్ట్, వెల్కమ్ సెంటర్‌లో సమన్వయానికి ప్రత్యేక సిబ్బంది నియామకం

### అత్యవసర పరిస్థితుల్లో ఆశ్రయం కల్పించేందుకు 2000 మంది ప్రవాస భారతీయుల గుర్తింపు

### కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, సాయ్, ప్రవాస భారతీయుల సంయుక్త కార్యాచరణ

ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నగోయాకు చేరుకుంటున్న భారత క్రీడాకారులకు వసతి విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. ఇందులో భాగంగా మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో భారత అథ్లెట్లు, అధికారులకు ఆశ్రయం కల్పించేందుకు నగోయాలో నివసిస్తున్న దాదాపు 2,000 మంది ప్రవాస భారతీయులను కూడా ఈ ప్రణాళికలో భాగస్వాములను చేసింది. ఐఏఎన్ఎస్‌కు అందిన వివరాల ప్రకారం, భారత క్రీడా మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), చెఫ్ డి మిషన్, నగోయాలోని ప్రవాస భారతీయులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. కొందరు భారత అథ్లెట్లు నగోయాకు చేరుకున్న తర్వాత వసతి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో భవిష్యత్తులో అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఈ చర్యలు చేపట్టారు. ఈ మూడంచెల వ్యూహంలో భాగంగా, మొదటి అంచెలో ఇద్దరు సిబ్బందిని ఎయిర్‌పోర్ట్‌లో అందుబాటులో ఉంచారు. వీరు భారత్ నుంచి వచ్చే అథ్లెట్లు, అధికారుల రాకపోకలను సమన్వయం చేస్తారు. రెండో అంచెలో, అథ్లెట్ వెల్కమ్ సెంటర్‌లో ముగ్గురు సిబ్బంది ఉంటారు. వీరు బస, ఇతర ఏర్పాట్ల విషయంలో క్రీడాకారులకు సహాయం అందిస్తారు. ఇక మూడో అంచె అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా నగోయాలోని సుమారు 2,000 మంది ప్రవాస భారతీయులతో ఒక సహాయక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. వసతికి సంబంధించి ఏదైనా తీవ్రమైన సమస్య తలెత్తితే, ఈ ప్రవాస భారతీయుల ఇళ్లలో భారత అథ్లెట్లు, అధికారులకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పిస్తారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వసతి కేంద్రం వరకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశం. క్రీడాకారులు వసతి సమస్యలతో సతమతం కాకుండా, తమ క్రీడాంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేలా చూడటమే లక్ష్యమని అధికారులు తెలిపారు.




# అతడు ఉండగా చింత ఎందుకు?.. శిఖర్ ధావన్‌తో బంధంపై రోహిత్ శర్మ

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తన ఓపెనింగ్ భాగస్వామి శిఖర్ ధావన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే కార్యక్రమంలో పాల్గొన్న హిట్ మ్యాన్, ధావన్‌ను తన ప్రాణ స్నేహితుడిగా అభివర్ణించాడు. "నా ప్రాణస్నేహితుడు వస్తున్నాడు కాబట్టే ఈరోజు నేను ఇంత ఉత్సాహంగా కనిపిస్తున్నాను" అని రోహిత్ చమత్కరించాడు. ఈ సందర్భంగా నిజమైన స్నేహానికి రోహిత్ శర్మ ఒక చక్కని నిర్వచనం ఇచ్చాడు. "కేవలం మీమ్స్, రీల్స్ పంచుకోవడమే స్నేహం కాదు. డ్రెస్సింగ్ రూమ్ అనుభవాలను, గెలుపోటములను, క్లిష్ట పరిస్థితులను, మైదానంలో ఓపెనింగ్ బాధ్యతలను పంచుకోవడమే నిజమైన స్నేహం" అని ఆయన అన్నాడు. జూనియర్ స్థాయి నుంచే తామిద్దరం కలిసి పోటీ క్రికెట్ ఆడటంతో తమ మధ్య ఇంతటి బలమైన బంధం ఏర్పడిందని వివరించాడు. ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే సమయంలో తనపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని రోహిత్ తెలిపాడు. "శిఖర్‌తో ఆడుతున్నప్పుడు నాపై ఒత్తిడి తగ్గుతుందని ఎప్పుడూ భావించేవాడిని. ఎందుకంటే అతను ఆ ఒత్తిడిని తనపైకి తీసుకుని, నా వరకు రాకుండా చూసేవాడు. అందుకే నేను ఎప్పుడూ 'శిఖర్ ఉండగా చింత ఎందుకు' అని అనుకుంటాను" అని రోహిత్ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీలలో ఒకటిగా నిలిచిన వీరిద్దరి స్నేహం, క్రికెట్ ప్రయాణాన్ని ఈ ఎపిసోడ్ ఆవిష్కరించింది.



హంస కలం వార్త

## కత్రినా కైఫ్‌పై ట్రోలింగ్.. మద్దతుగా నిలిచిన నటి సోనారికా



బాలీవుడ్ ప్రముఖ నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం బరువు పెరిగారంటూ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న విమర్శలు, ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి సోనారికా భడోరియా తీవ్రస్థాయిలో స్పందించారు. మాతృత్వం పొందిన మహిళల శరీరంలో వచ్చే సహజ సిద్ధమైన మార్పులను ప్రశ్నించడం, వారి రూపాన్ని బట్టి విమర్శించడం అత్యంత విచారకరమని పేర్కొంటూ కత్రినాకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల్లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. బిడ్డకు జన్మనివ్వడం అనేది అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, ఆ సమయంలో మహిళ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుందని సోనారికా గుర్తుచేశారు. ఒక నటిగా సమాజంలో ఎంతటి గుర్తింపు ఉన్నప్పటికీ, ఆమె ప్రసవం తర్వాత ఎలా కనిపిస్తోంది లేదా ఎంత బరువు పెరిగింది అనే దానికంటే ఒక బిడ్డకు జన్మనివ్వడానికి ఆమె పడిన శ్రమను, గడిపిన నిద్రలేని రాత్రులను అర్థం చేసుకోవడం ముఖ్యమని చెప్పారు. మాతృత్వం కోసం సర్వస్వం త్యాగం చేయాలని కోరుకునే ఈ ప్రపంచం, ప్రసవానంతరం మహిళ శరీరం మారకూడదని ఆశించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఈ తరహా ట్రోలింగ్ వల్ల ప్రసవానంతరం మహిళలు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉందని, నెటిజన్లు కాస్త సున్నితంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. 'జాదుగాడు', 'స్పీడున్నోడు', 'ఈడోరకం-ఆడోరకం' వంటి తెలుగు చిత్రాలతో గుర్తింపు పొందిన సోనారికా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

## 'రాకా'పై పెరుగుతున్న ఆసక్తి.. '37' తర్వాత మరో క్రిప్టిక్ టీజర్!

అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'రాకా'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. సినిమా కథ, పాత్రలకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటికీ రహస్యంగానే ఉంచుతున్నారు. తాజాగా మరో క్రిప్టిక్ టీజర్‌ను విడుదల చేయడంతో అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సన్ పిక్చర్స్ విడుదల చేసిన ఈ వీడియోలో.. "అసాధ్యంగా అనిపించిన దానిని దాటి.. ఊహించడానికి ధైర్యం చేశాం. దాన్ని ఆర్కైవ్ చేయడానికి ధైర్యం చేశాం. రాకా: ఏ గ్లోబల్ ట్రయంఫ్" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే 'గ్లోబల్ ట్రయంఫ్' అంటే ఏంటి? సినిమాకు సంబంధించిన ఏ అంశాన్ని ఇది సూచిస్తోంది? అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఒకరోజు ముందు మేకర్స్ విడుదల చేసిన '37' అనే సంకేతం కూడా ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు 'గ్లోబల్ ట్రయంఫ్' అనే మరో క్లూతో అసలు కథేంటన్న ఆసక్తిని మరింత పెంచారు. 'రాకా' రెండు కాలాల్లో సాగే కథగా తెలుస్తోంది. ఆధునిక కాలానికి సంబంధించిన కథలో మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. పురాణ వైదిక కాలానికి సంబంధించిన భాగంలో దీపికా పదుకొణె, జాన్వీ కపూర్, రష్మిక మందన్న నటిస్తున్నట్లు సమాచారం. దీపిక ఓ గర్భిణి పాత్రలో కనిపించనున్నట్లు గతంలో కథనాలు వచ్చాయి. రష్మిక ఆమెకు మార్గదర్శిగా, రక్షకురాలిగా కనిపిస్తారని సమాచారం. జాన్వీ గిరిజన రాణి పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్‌కు తొలి సినిమా. షారుక్ ఖాన్ కూడా అంతర్జాతీయ షెడ్యూల్‌లో కీలక అతిథి పాత్ర కోసం షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. అయితే '37'కు 'గ్లోబల్ ట్రయంఫ్'కు ఉన్న సంబంధం ఏంటన్నది మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.






## "మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండు".. శ్రుతి హాసన్ ఇలా అనేసిందేంటి?

"మగవాళ్లకు కూడా నెలసరి (పీరియడ్స్) వస్తే ఎంత బాగుండు! కనీసం అప్పుడైనా మా కాంట్రాక్టులలో అధికారికంగా 'పీరియడ్స్ సెలవులు' అని రాసేవారేమో" అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగా మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతి ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటానని ఆమె వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరితోనూ చెప్పుకోలేకపోయానని గుర్తుచేసుకున్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించడం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించేదాన్నని తెలిపారు. "కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని. నా ఎనర్జీ లెవెల్స్ పడిపోయేవి. కానీ, దర్శకులు గానీ, ఇతరులు గానీ నాలో ఆ మార్పును గమనించినా అసలు కారణం వారికి తెలిసేది కాదు" అని శ్రుతి వివరించారు. అయితే, ఓ సంఘటన తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని శ్రుతి తెలిపారు. తన సహనటుడికి మోకాలికి సర్జరీ అయినప్పుడు, షూటింగ్ సిబ్బంది మొత్తం అతనికి అనుకూలంగా ఏర్పాట్లు చేసి, చాలా జాగ్రత్తగా చూసుకున్నారని చెప్పారు. అది చూశాక, తన ఆరోగ్య సమస్య గురించి కూడా ధైర్యంగా మాట్లాడాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఆ తర్వాత మొదటిసారి ఓ దర్శకుడికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించానని, ఆయనకు కూడా కూతురు ఉండటంతో తన బాధను వెంటనే అర్థం చేసుకున్నారని శ్రుతి గుర్తుచేసుకున్నారు. "ఆయన సానుకూల స్పందనతో మా మధ్య సంభాషణ తీరే మారిపోయింది. సెట్‌లో వాతావరణం మరింత స్నేహపూర్వకంగా మారింది. ఆ తర్వాత నుంచి నా ఇబ్బందిని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు. శ్రుతి వ్యాఖ్యలకు సోహా అలీ ఖాన్ కూడా మద్దతు తెలిపారు. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే, ఎవరు ఎక్కువ బ్లీడ్ అయ్యారు, ఎవరి ట్యాంపూన్ సైజు పెద్దది అనే విషయాల్లో వారు పోటీ పడేవారేమోనని సరదాగా వ్యాఖ్యానించారు. ఇక శ్రుతి సినిమాల విషయానికొస్తే, గతేడాది రజినీకాంత్‌తో కలిసి నటించిన 'కూలీ' చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.518 కోట్లు వసూలు చేసినా మిశ్రమ స్పందనలు అందుకుంది. ఇటీవల 'పెద్ది' చిత్రంలో ఓ పాటలో ఆమె కనిపించారు. ప్రస్తుతం ఆమె విజయ్ సేతుపతితో కలిసి తమిళంలో 'ట్రైన్', దుల్కర్ సల్మాన్‌తో తెలుగులో 'ఆకాశంలో ఒక తార' చిత్రాల్లో నటిస్తున్నారు.

Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449